క్లుప్తంగా

క్షేత్రస్థాయి సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఏఓ సుబ్బారావు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఆర్బీకేలో రాగి ధాన్యం కొనుగోలుపై క్షేత్రస్థాయి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఏఓ సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి పంటకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.3,846గా ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సహాయకులు రాగి పండించిన రైతులను కలిసి ధాన్యం సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, సివిల్ సప్లయ్స్ డీఎం అశ్వర్థనారాయణ, వ్యవసాయాధికారి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ సీజ్

రొళ్ల: మండల కేంద్రంలో జీబీ హళ్లిలో రైతు తిమ్మరాజు చెందిన ట్రాక్టర్ ను సోమవారం హిందూపురం మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆరేళ్లుగా ఇన్సూరెన్స్ చేయించుకోకపోవడంతో రూ.66,900 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం: బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలి.. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పాటించాలని వాసవ్య మహిళా మండలి కుశాల్ విప్రోకేర్ క్లినిక్ ఆరోగ్య సిబ్బంది అన్నారు. సోమవారం మండంలోని తూమకుంట చెక్‌పోస్టు షాలిమర్ కంపెనీలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పెనుకొండ రూరల్: మూడు రోజుల క్రితం అమ్మవారిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి చెందాడు. మృతునికి సంబంధించి బంధువులెవరూ లేకపోవడంతో సోమవారం కొందరు ముస్లిం యువకుల సహకారంతో పట్టణంలోని ముస్లిం శ్మశాన వాటికలో ఖననం చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ తిమ్మప్ప

మడకశిరరూరల్: మండలంలో బోరుబావుల కింద వరి పంట సాగుచేసిన రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఏఓ తిమ్మప్ప రైతులకు సూచించారు. సోమవారం ఆయన సిద్ధగిరి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. తెగుళ్ల నివారణపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. బోరు బావుల కింద పండించిన రాగులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.3,846 చొప్పున మద్దతు ధర కల్పించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి

పావగడ: తాలూకాలోని అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధి లోని లింగదహళ్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ మదన్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన సతీష్, పెన్నోబనహళ్లి ఈరలింగారెడ్డి దాడి చేశారు. గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద సోమవారం తన అంగడిలో ఉండగా తనపై దాడి చేశారని బాధితుడు అరసికెరె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ థారాసింగ్ తెలిపారు.

వ్యవసాయాభివృద్ధికి సహకరించండి



వ్యవసాయశాఖమంత్రి గోవర్ధన్‌రెడ్డిని కలిసిన వేణురెడ్డి

హిందూపురం: పట్టుగూళ్ల రైతులకు రావాల్సిన ఇన్‌సెటివ్‌తో పాటు నియోజకవర్గంలో వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని కోరినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి తెలిపారు. విజయవాడలో మంత్రిని కలిసి ఈమేరకు వినతిపత్రం ఇచ్చామన్నారు. పట్టుగూళ్ల రైతుల ఇన్‌సెటివ్‌లతో పాటు రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

‘పురం’ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- ‘అమృత్ భారత్’ కింద రూ.15 కోట్లు మంజూరు
- తుదిదశకు టెండర్ల ప్రక్రియ
- త్వరలోనే పనులు చేపడతామంటున్న అధికారులు



హిందూపురం రైల్వేస్టేషన్ ముఖద్వారం

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఈ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన విషయం అందరికీ తెలిసిందే. ఇందులో భాగంగానే కొన్నేళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. రూ.15 కోట్లతో వివిధ పనులు చేపట్టనున్నారు. ఏఏ పనులు చేపట్టాలి? దేనికి ఎంత నిధులు వెచ్చించాలి? అన్న వాటిని పరిశీలించేందుకు ఇటీవలే రైల్వే ఉన్నతాధికారులు పురం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. చేపట్టాల్సిన పనులపై కూడా క్లారిటీ వచ్చింది.

అభివృద్ధి, సౌకర్యాలపై దృష్టి

అమృత్ భారత్ పథకం ద్వారా మాస్టర్ ప్లాన్ ప్రకారం హిందూపురం రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపరచనున్నారు. ప్రయాణికులకు ఆధునిక వసతులు కల్పించడం, ప్లాట్‌ఫామ్‌పై టైల్స్, ఎస్కలేటర్ ఏర్పాటు, లిఫ్ట్, నూతనంగా టాయిలెట్స్, ఉచిత వై ఫై, ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఏర్పాటు, రైల్వే స్టేషన్ ముఖద్వారం అభివృద్ధి, ప్లాట్ ఫారమ్‌పై బోర్డులు, ఎలక్ట్రిక్ లైటింగ్ వర్క్స్ కూడా చేయనున్నారు.

డబుల్ లైన్‌తో ప్రయాణం సులువు

గతంలో ధర్మవరం – బెంగళూరు సింగల్ లైన్ ఉండేది. ఇప్పుడు డబుల్ ట్రాక్ పూర్తవడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లు ఏర్పాటు చేశారు. దీంతో రైళ్లు సమయానికి వస్తుండటంతో ప్రయాణం సులభంగా మారిందని ప్రయాణికులు చెబుతున్నారు. త్వరలోనే హిందూపురం రైల్వేస్టేషన్‌లో సకల సౌకర్యాలు ఏర్పాటు కానుండటంతో అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పనులు

హిందూపురం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇది ముగిసిన వెంటనే పనులు చేపట్టనున్నారు. అన్ని పనులు పూర్తయితే రైల్వేస్టేషన్ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండనుంది.

‘వందేభారత్’ ఆపాలని వినతులు

సికింద్రాబాద్ – యశ్వంతపూర్ మధ్య నడుస్తున్న వందే భారత్ రైలు ఆపాలని ప్రజా ప్రతినిధులు, ప్రయాణికులు రైల్వే అధికారులకు విన్నవిస్తున్నారు. పట్టణ జనాభా 3 లక్షల వరకు ఉండటం, బెంగళూరు 100 కిలో మీటర్ల దూరంలో ఉండటంతో నిత్యం వ్యాపారులు, ఉద్యోగులు బెంగళూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. అందరి సౌకర్యార్థం వందే భారత్‌ను హిందూపురంలో ఆపాలని అందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



హిందూపురం రైల్వేస్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్లాన్, డిజైనింగ్ ప్రక్రియ జరుగుతోంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యంగా నిధులు ఖర్చు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– కిరణ్, మజ్దూర్ యూనియన్ కార్యదర్శి, బెంగళూరు డివిజన్

పోలీస్ యూనిఫాంలో పైసా వసూల్ !

పెనుకొండ రూరల్: దసరా మామూళ్ల వసూలు చేసేందుకు ఓ వ్యక్తి ఏకంగా పోలీసుగా అవతారమెత్తాడు. పోలీసు యూనిఫాం వేసుకొని కుల కిరణ్ అన్న నేమ్ ప్లేట్ వేసుకొని ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా కియా ఎస్‌ఐ రమేష్ బాబు వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరైనా బెదిరించినా, డబ్బులు డిమాండ్ చేసినా నేరుగా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇదిలా ఉంటే.. గతంలో కొందరు పోలీసుల ప్రమేయంతో ఖాకీ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

విధులకు గైర్హాజరైతే చర్యలు

రొళ్ల: అంగనవాడీ వర్కర్లు విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని సీఎం ఘట్ట అంగనవాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి స్టాకు వివరాలపై ఆరా తీశారు. సోమవారం ఉదయం 11 గంటలైనా సెంటర్‌లో వర్కర్ అందుబాటులో లేకపోవడం విషయంపై అడిగి తెలుసుకున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- ‘పురం’ రూపురేఖలు మార్చేస్తాం
- గడప గడపకూ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



2వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: నియోజకవర్గాన్ని ఏళ్లుగా పాలిస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధులు సరైన రోడ్లు, డ్రైనేజీలు వేయలేకపోయారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక విమర్శించారు. స్థానికంగా ఎమ్మెల్యే లేకపోవడం, ప్రజల సమస్యలపై అసెంబ్లీ గళమెత్తే వారు లేకపోవడంతో హిందూపురంలో అభివృద్ధి కుంటుపడుతూ వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఒక్క అవకాశం ఇస్తే హిందూపురం రూపురేఖలు మార్చివేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ రామచంద్ర అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వార్డులో సుశీలమ్మ అనే మహిళ తన ఇంటికి విద్యుత్ సరఫరా ఇప్పించాలని కోరడంతో వెంటనే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి వెంటనే కనెక్షన్ ఇప్పించారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను ఇంటి వద్దకే అందిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇఇ వెంకటరమణ, డీఈ బాలసుబ్రమణ్యం, వాణి, జేఈ జనార్దన్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు శివ, ఆసిఫ్, షాజియా, పార్వతి, మల్లికార్జున, షేక్‌రేష్మాభాను, మనీ, చాంద్‌బాషా, ఫరూక్, నాయకులు నాగమణి, దాదు, వేణుగోపాల్, బాబు, హయత్, సురేష్, లడ్డూ, బేరింగ్‌మస్తాన్, రమేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం లక్ష్యం



పీసీ గిరిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

గుడిబండ: ‘జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరంలాంటివి. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం’ అని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సోమవారం పీసీగిరిలో గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి సందర్శించారు. వైద్య శిబిరం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. పైసా ఖర్చు లేకుండా ప్రజలు వైద్య చికిత్సతో పాటు కంటి పరీక్షలను నిర్వహించి మందులు, అద్దాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు మళ్ళీ ఆశీర్వదించాలన్నారు. సర్పంచ్ రంగస్వామి, ఉపసర్పంచ్ ఆనంద్, సింగల్‌విండో అధ్యక్షులు చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యంజారేగౌడ్, మండల ఎస్సీ,ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్, గిరిధర్, వివిధ కమిటీ సభ్యులు నాగన్న, రంగనాథ్, కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో సరిహద్దు రాళ్ల తొలగింపు



ప్రభుత్వ భూమిలో తొలగించిన సరిహద్దు రాళ్లు, కంచె

పరిగి: మండల కేంద్రంలోని పాత నిజాం షుగర్ ఫ్యాక్టరీ భూములకు ఆనుకుని ఉన్న సరిహద్దు భూమిలో రెవెన్యూశాఖ అధికారులు పాతిన సరిహద్దు రాళ్లను దుండగులు తొలగించారు. ఆదివారం ఈ ఘటన చోటు చేసుకోగా సోమవారం రెవెన్యూశాఖ అధికారులు గుర్తించారు. గతంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ పరిశ్రమ ఉన్న భూమికి సరిహద్దుగా ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబరు 368–2లో దాదాపు మూడెకరాల భూ విస్తీర్ణంలో రెవెన్యూశాఖ అధికారులు కంచె ఏర్పాటు చేశారు. సదరు భూమిలో పాతిపెట్టిన రాళ్లతో పాటు కంచెను దుండగులు తొలగించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు సౌజన్యలక్ష్మీ ఎస్‌ఐ నరేంద్రను కోరారు.

ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ట



లేపాక్షి: మండల కేంద్రమైన పాత లేపాక్షిలో వెలసిన చెరువు గంగమ్మదేవి విగ్రహాన్ని సోమవారం ఘనంగా పునఃప్రతిష్టించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహం, కలశస్థాపన, నవగ్రహపూజ, పంచామృతాభిషేకం, మూలమంత్ర హోమము, నవగ్రహ శాంతి హోమము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధికి లేపాక్షికి చెందిన పాత్రికేయుడు ప్రభాకర్‌రెడ్డి రూ.10 వేలు విరాళంగా అందించారు.

ఢిల్లీకి చేరిన మట్టి

చిలమత్తూరు: దేశ సమైక్యతను చాటడానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన నా దేశం – నా మట్టి కార్యక్రమంలో భాగంగా మండల వలంటీర్ అశోక్‌రెడ్డి దేశరాజధానికి వెళ్లి మట్టిని సమర్పించారు. సోమవారం ఢిల్లీలో కర్తవ్యపథ్‌లో ఏర్పాటు చేసిన అమృత వాటికలో చిలమత్తూరు మట్టిని సమర్పించినట్లు వలంటీర్ తెలిపారు.

వంట పాత్రల పంపిణీ

రొళ్ల: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం నిర్వహణకు ప్రభుత్వం నుంచి మంజూరైన వంట పాత్రలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ–2 శ్రీధర్ తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా పాత్రలను పంపిణీ చేశామన్నారు.

సోమందేపల్లిలో ఓపెన్ హౌస్



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

సోమందేపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విజయ్‌కుమార్ పోలీసు విధుల గురించి విద్యార్థులకు వివరించారు. ఆయుధాల వినియోగం, లాకప్ గదులు, నేరస్తులపై కేసు నమోదు చేసే తీరును తెలియజేశారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ప్రయోజకులు కావాలని సూచించారు.

డాక్టర్ శ్రీకాంతికి అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును అందుకుంటున్న వైద్యురాలు శ్రీకాంతి

హిందూపురం టౌన్: వైద్య వృత్తిలో ఉత్తమ సేవలు అందిస్తున్న స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి చిన్నపిల్లల వైద్యురాలు శ్రీకాంతిని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు వరించింది. ఈ నెల 28న హైదరాబాద్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏసీటీ నా సోషల్ ఆర్గనైజేషన్ సెంటర్ ప్రతినిధులు శ్రీకాంతికి అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు.

లేపాక్షి ఎస్‌ఐగా గోపి

లేపాక్షి: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా కే.గోపి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఐ గోపి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

నలుగురిపై కేసు నమోదు

అగళి: మండల పరిధిలోని కదిరేపల్లికి చెందిన బసవరాజుపై నలుగురు దాడి చేసినట్లు ఎస్‌ఐ లావణ్య తెలిపారు. బసవరాజు అల్లుడు భూతరాజు, కిరణ్ ముందుగానే గొడవపడ్డారన్నారు. అయితే సోమవారం వన్నేశప్ప అంగడి వద్ద రావుడి ఎంపీటీసీ నింగమ్మ భర్త బసవరాజు కూర్చొని ఉండగా కిరణ్, తిమ్మరాజు, రమేష్, వేద దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వాల్మీకిని ఆదర్శంగా తీసుకుందాం



వాల్మీకి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని వాల్మీకి కమిటీ సభ్యులు కోరారు. సోమవారం అమరాపురంలో వాల్మీకి జయంతి ఉత్సవాలను బోయ, వాల్మీకి కులస్తులు ఘనంగా నిర్వహించారు. ట్రాక్టరులో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని కొలువుదీర్చి ఊరేగించారు.

ఆరోగ్య సర్వే ప్రారంభం

చిలమత్తూరు: ప్రజారోగ్యస్థితి, మెరుగైన ఆరోగ్య వ్యవస్థ ఏర్పాటు వంటి విషయాలను అధ్యయనం చేయడానికి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలో సిగ్మా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వే మూడు రోజుల పాటు నిర్వహించనున్నారని, ప్రజలు సహకరించడం ద్వారా మెరుగైన ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చని వైద్యాధికారి నికేష్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



హైటెన్షన్ పోల్‌కు ఉరివేసుకున్న రైతు

పావగడ: తాలూకాలోని ఎర్రపాళ్య గ్రామానికి చెందిన రైతు నారాయణప్ప (65) పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామ సమీపంలోని హైటెన్షన్ పవర్ టవర్‌కు సోమవారం ఉరివేసుకుని బలవన్మరణం చేసుకున్నాడు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బూదిబెట్ట గ్రామానికి చెందిన నారాయణప్ప ఎర్రపాళ్యలో వివాహం చేసుకుని అక్కడే స్థిర పడ్డాడు. గ్రామ సమీపంలోని బైలాంజనేయస్వామి దేవాలయం దగ్గర ఉన్న తన సొంత వ్యవసాయ భూమిలో ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ గురునాథ్ తెలిపారు.

ఆంధ్ర పాదుకా సహస్ర గ్రంథం ఆవిష్కరణ



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆంధ్ర పాదుకా సహస్ర గ్రంథం ఆవిష్కరించినట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. మద్వేదాంత దేశికులు సంస్కృతంలో రాసిన ఆంధ్ర పాదుకా సహస్రాన్ని తెలుగులోకి అనువదించామన్నారు. వింజమూరి శేషఫణిశర్మ వంద గ్రంథాలను పుట్టపర్తి ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల తెలుగు అధ్యాపకులు సత్యనారాయణ దీప్తి, ప్రధానోపాధ్యాయుడు చింతకాయల శ్రీనివాసులు సహకారంతో గ్రంథాలను వివిధ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



పరిగి: మాట్లాడుతున్న తహసీల్దారు సౌజన్యలక్ష్మీ



రొళ్ల : మాట్లాడుతున్న తహసీల్దార్ హసీనాసుల్తానా

- పౌరహక్కుల దినోత్సవంలో వక్తలు

పరిగి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. పౌరహక్కుల దినోత్సవాన్ని మండలంలోని హొన్నంపల్లిలో నిర్వహించారు. తహసీల్దారు సౌజన్యలక్ష్మీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు, విధులు, చట్టాలు భారతీయ పౌరులందరికీ వర్తిస్తాయన్నారు. అందరూ చదువుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమని సాంఘిక సంక్షేమశాఖ అధికారి (హాస్టల్ వార్డెన్) వీరనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేంద్ర, సర్పంచ్ మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలపరిధిలోని మందలపల్లి ఎస్సీకాలనీలో సోమవారం సాయంత్రం రెవిన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా పౌరహక్కులపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ రంగనాయకులు , ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, సర్పంచ్ ప్రమీలమ్మ, వీఆర్‌ఓ సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తహసీల్దార్ జమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో స్థానికులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గుర్రప్ప ,ఏఎస్‌ఐ బషీర్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు గ్రామంలో సోమవారం అధికారులు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సర్దార్‌వలి మాట్లాడుతూ ప్రతి పౌరుడు చట్టాలకు లోబడి తమ హక్కులను స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్వర్థనారాయణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రతి పౌరుడు సోదర భావంతో మెలగాలని తహసీల్దార్ హసీనాసుల్తానా పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కాకి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీ, నాయకుడు యర్రగుంటప్ప, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని రాంపురం బీఈడీ కళాశాల సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... రాంపురానికి చెందిన మస్తాన్ పెనుకొండ వైపు నుంచి కొత్తచెరువు వైపు వెళ్తున్నాడు. అయితే బీఈడీ కళాశాల దగ్గర శెట్టిపల్లికి చెందిన క్రిష్టారెడ్డి ద్విచక్ర వాహనంతో ప్రమాదవశాత్తూ మస్తాన్ బైక్‌ను ఢీ కొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. మస్తాన్‌కు తీవ్రగాయాలు కావడంతో అనంతపురం తరలించారు.

అక్రమ కేసు కొట్టేయండి

పెనుకొండ: తమపై బనాయించిన అక్రమ కేసును కొట్టేయాలని పట్టణంలోని దర్గాపేటకు చెందిన మన్సూర్‌బాషా, ఆయన భార్య గాయత్రి కోరారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. తోటగేరికి చెందిన వెంకటేసులుతో రూ.40 వేలు అప్పుతీసుకున్నామన్నారు. దానిపై మాట్లాడేందుకు వారి ఇంటికెళ్లగా వాగ్వివాదం జరిగిందన్నారు. మద్యం సేవించి గొడవకు వచ్చినట్లు పోలీసులు తమపై కేసు నమోదు చేశారని, మద్యం సేవించినట్లు డాక్టర్ల నివేదిక లేకుండానే కేసు ఎలా నమోదు చేస్తారని వారు ప్రశ్నించారు. కేసు కొట్టేసి పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు.